క్లుప్తంగా

వైభవంగా మహాలక్ష్మి తీర్థం



గొడ్డటిపాలెంలో మహాలక్ష్మి తల్లిని దర్శించుకుంటున్న భక్తులు

కరప: గొడ్డటిపాలెం గ్రామదేవత మహాలక్ష్మి తల్లి తీర్థం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఏటా ఉగాది రోజున నిర్వహించే ముందురోజు రాత్రి తెల్లవార్లూ గరగ నృత్యాలు, గారడీలతో అమ్మవారికి జాతర నిర్వహించారు. గ్రామస్తులు, పరిసర గ్రామాలవారు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయకమిటీ సభ్యులు, గ్రామ పెద్దలతో కలసి సర్పంచ్ శ్రీనుబాబు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పల్లపువీధిలో గంటాలమ్మ తీర్థం..

పంచాయతీ పరిధిలోని పల్లపువీధి గ్రామదేవత గంటాలమ్మ తీర్థం మంగళవారం జరిగింది. వేద పండితులు ముత్యం ప్రసాదరావు ఆధ్వర్యంలో కొక్కిరిగడ్డ సుబ్రహ్మణ్యం బృందం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయకమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. కరప పరిసర గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

భావనారాయణ స్వామికి వెండి ప్లేటు సమర్పణ



ఆలయంలో వెండి పళ్లెం సమర్పిస్తున్న దాత అనిశెట్టి శ్రీను, కుటుంబ సభ్యులు

కాకినాడ రూరల్: మండలంలోని సర్పవరం గ్రామంలో రాజ్యలక్ష్మి సమేత భావనారాయణ స్వామి ఆలయంలో స్వామి వారి నిత్య కైంకర్యాలలో వాడేందుకు 750 గ్రాముల వెండితో తయారు చేయించిన ప్లేటును భక్తుడు అనిశెట్టి శ్రీను, కుటుంబ సభ్యులు బహూకరించారు. భావనారాయణ స్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు అనంతరం ఆలయ అర్చకులు, దేవాదాయ శాఖ అధికారులు, ఆలయ కమిటీ చైర్మన్ పుల్ల శ్రీరాములుకు దాత దానిని అందించారు.

జాతీయ సమైక్యతే లక్ష్యం



ఖిద్మత్ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఉగాది ఉత్సవంలో పాల్గొన్న హిందూ, ముస్లిం ప్రతినిధులు

కాకినాడ సిటీ: మన కాకినాడ, మన ఉగాది, మన రంజాన్ అనే శీర్షికతో కాకినాడ ఖిద్మత్ కమిటీ వ్యవస్థాపక మాజీ అధ్యక్షులు హసన్ షరీఫ్ అధ్యక్షతన కాకినాడ పీఆర్ భవన్‌లో ఉగాది, రంజాన్ పండుగ వేడుకల సందర్భంగా మంగళవారం ఇఫ్తార్ విందు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భోగి గణపతి పీఠాధిపతి దూసర్లపూడి రమణరాజు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రస్తుత దేశ పరిస్థితులకు మతం ఆధారితంగా చట్టాలను చేస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలు, ముస్లిం సమాజంపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని హిందూ బంధువులు అందరూ ఖండించి వారికి అండగా నిలవాలన్నారు. హసన్ షరీఫ్ మాట్లాడుతూ ఖిద్మత్ కమిటీ ఎల్లప్పుడు జాతి సమైఖ్యతను కాంక్షిస్తుంది. అని అందుకే ఆపదలో ఉన్న వారు ఏ మతం అని చూడకుండా సభ్యులు ఆచరణాత్మకంగా భారత దేశ లౌకిక స్వరూపాన్ని చాటుతున్నట్టు వివరించారు. అనంతరం సమాచార హక్కు చట్టం రాష్ట్ర సమితి నాయకులు పప్పు దుర్గారమేష్ మాట్లాడుతూ వచ్చే ఏడాది హిందువు, ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఇచ్చి మరింతగా కాకినాడలో ఐకమత్యాన్ని చాటుదామని పిలుపునిచ్చారు. కమిటీ అధ్యక్షులు చిప్తి కార్యదర్శి హుస్సేన్, కోశాధికారి గౌస్, సభ్యులు ఫక్రుద్దీన్ అలీ, నసీర్ సాధిక్, గణేష్, బాషా తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

సామర్లకోట: స్థానిక బసివిరెడ్డి సత్రం వద్ద పెద్దాపురం శ్రీ లక్ష్మీగణపతి ఆటో యూనియన్ కార్యాలయం వద్ద మంగళవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఆటో యూనియన్ అధ్యక్షుడు సోమేష్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఎండలు ఎక్కువగా ఉండటంతో బాటసారులకు ప్రతి రోజు మజ్జిగ పోయాలని నిర్ణయించినట్టు తెలిపారు. 80 లీటర్ల పెరుగుతో 400 లీటర్ల మజ్జిగ ప్రజలకు పంపిణీ చేయనున్నట్టు వారు తెలిపారు.

భువనేశ్వరి పీఠం ఆధ్వర్యంలో..

పెద్దాపురం: భువనేశ్వరి పీఠం సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పీఠాధిపతి చింతా గోపిశర్మ సిద్ధాంతి అన్నారు. ఉగాది సందర్భంగా మంగళవారం స్థానిక మెయిన్‌రోడ్డులో చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గోపిశర్మ మాట్లాడుతూ భువనేశ్వరి పీఠం ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేస్తామన్నారు. పుర ప్రజలు పీఠం సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ప్రజలు సుభిక్షంగా ఉండాలి

- మళ్లీ ఐదేళ్ల పాటు సీఎంగా జగన్
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- జిల్లా పార్టీ కార్యాలయంలో భక్తి శ్రద్ధలతో ఉగాది వేడుకలు



రమణయ్యపేట వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన ఉగాది వేడుకల్లో పాల్గొన్న కురసాల కన్నబాబు తదితరులు



నూకాలమ్మ తల్లి దర్శనం కోసం క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు



కరప విష్ణ్వాలయంలో ప్రత్యేకంగా అలంకరించిన వేణుగోపాలస్వామి

కాకినాడ రూరల్: శ్రీ క్రోధి నామ సంవత్సరంలో ప్రజలు సుభిక్షంగా ఉండాలని, ఆయురారోగ్యాలతో పాటు ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందాలని కోరుకుంటున్నట్టు మాజీ మంత్రి, ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కురసాల కన్నబాబు ఆకాంక్షించారు. స్థానిక రమణయ్యపేట వైద్యనగర్‌లోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో కన్నబాబు ఆధ్వర్యంలో మంగళవారం ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. తొలుత నూతన తెలుగు సంవత్సరం ఉగాది ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం వేద పండితులు పంచాంగ పఠనం చేశారు. పండిత ఆశీర్వచనం తరువాత నూతన సంవత్సర పంచాంగాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కన్నబాబు మాట్లాడుతూ ఐదేళ్ల పాటు రాష్ట్రం సుభిక్షంగా, సస్య శ్యామలంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో ప్రతి కుటుంబానికి మేలు జరిగేలా పాలన జరిగిందన్నారు. మళ్లీ క్రోధినామ సంవత్సరంలో ఐదేళ్ల పాటు ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. సీఎంగా మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వస్తారన్నారు. రాబోవు ఎన్నికలలో వైఎస్సార్ సీపీ విజయం సాధిస్తుందన్నారు. ఎమ్మెల్యేగా తాను, ఎంపీగా చలమలశెట్టి సునీల్ విజయం సాధిస్తామన్నారు. జిల్లా ప్రజలందరికీ ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో కురసాల సత్యనారాయణ, ముత్యాల సతీష్, జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, ఏఎంసీ చైర్మన్ కర్నాసుల సీతారామాంజనేయులు, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం నాయకురాలు జమ్మలమడక నాగమణి తదితరులు పాల్గొన్నారు.

భావనారాయణ స్వామి ఆలయంలో..

క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలను నియోజకవర్గ ప్రజలు ఘనంగా నిర్వహించారు. భక్తులకు ఆయా ఆలయ కమిటీలు ఉగాది పచ్చడిని పంపిణీ చేశాయి. సర్పవరం భావనారాయణ స్వామి ఆలయంలో మంగళవారం పంచాంగ పఠనం చేశారు. ఆలయ చైర్మన్ పుల్ల నారాయణరావు ఈ ఉగాది పంచాంగాలను పంపిణీ చేశారు.

కరపలో..

కరప: మండల పరిధిలోని గ్రామాల్లో ఉగాది వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకొన్నారు. భక్తులు విష్ణు, శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కరప విష్ణాలయంలో ప్రత్యేకపూజలు చేసి పంచాంగ పఠనం చేశారు. ఈఓ తిరుమలకుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. చినమామిడాడ పంచముఖేశ్వర ఆలయంలో వంశపారంపర్య ధర్మకర్త మెర్ల వీరయ్యచౌదరి ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు నిర్వహించారు. యండమూరులోని సామ్రాజ్యలక్ష్మి, గోదాదేవి సమేత వెంకటేశ్వరస్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి, పంచాంగ పఠనం చేశారు. ఆయా గ్రామాల్లోని భక్తులు ఆలయాలకు వెళ్లి స్వామివార్లను దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. వేళంగి, కూరాడ, వాకాడ, వేములవాడు, పెనుగుదురు, నడకుదురు, గురజనాపల్లి, గొర్రిపూడి, కొంగోడు, పెద్దాపురప్పాడు, తదితర గ్రామాల్లోని ఆలయాల్లో ప్రత్యేకపూజలు నిర్వహించారు.

నగరంలో ఘనంగా ఉగాది వేడుకలు

బోట్‌క్లబ్: ఉగాది పర్వదినాన మంగళవారం భక్తులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే లేచి, తలస్నానం చేసి కొత్త దుస్తులు ధరించి సమీపంలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. పలు ఆలయాల్లో పంచాంగ పఠనం చేశారు. అనంతరం భక్తులకు ఆయా ఆలయ కమిటీల ఆధ్వర్యంలో ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. స్థానిక సూర్యారావుపేటలోని బాలత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వరస్వామి ప్రత్యేక అభిషేకాలు, అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయంలో వసంత నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారు ఉగాది సందర్భంగా బంగారం చీరలో భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక దేవాలయం వీధిలోని బాలా త్రిపుర సుందరి సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక వేణుగోపాలస్వామి ఆలయంలో ఆలయ ప్రధాన అర్చకుడు పొందూరు రామకృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్థానిక టూటౌన్, మార్కెట్‌లోని నూకాలమ్మ తల్లిని భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకొన్నారు. స్థానిక మెయిన్‌రోడ్డులోని సీతారామస్వామి ఆలయంలో పంచాంగ పఠనం చేశారు. నగరంలోని పలు వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు దర్శనం కోసం పోటెత్తారు.

నూకాలమ్మ తల్లి దర్శనానికి పోటెత్తిన భక్తులు

ఉగాది రోజున స్థానిక టూటౌన్ నూకాలమ్మ తల్లి ఆలయంలో దర్శనం కోసం భక్తులు క్యూలు కట్టారు. ఉదయం నుంచి రాత్రి వరకూ కిలోమీటర్లు మేర క్యూలైన్‌లో భక్తులు వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఉచిత దర్శనంతో పాటు, రూ.30 దర్శనం కోసం కూడా భక్తులు గంటలు కొద్ది నిరీక్షించాల్సిన పరిస్థితి వచ్చింది. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ ఈఓ లక్ష్మణరావు, పండగ ప్రత్యేకాధికారి వడ్డి ఫణికుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో..

కాకినాడ బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు అర్జరపు సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో క్రోధి నామ ఉగాది వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక విద్యుత్ నగర్‌లోని చల్లా కల్యాణ మండపంలో జిల్లా బ్రాహ్మణ సంఘ అధ్యక్షుడు దంతుర్తి ప్రసాద్ ముఖ్య అతిథిగా విచ్చేసిన ఈ వేడుకల్లో చల్లా నిరంజన్ శ్రీనివాస్ దంపతులను సత్కరించారు. అనంతరం రాష్ట్రపతి పురస్కార గ్రహీత, ఉపాధ్యాయులు ఆకొండి వెంకట సూర్యనారాయణ మూర్తి పంచాంగ పఠనం చేశారు. ఈ కార్యక్రమంలో నగర బ్రాహ్మణ సంఘ సభ్యులు అయ్యగారి వెంకటేష్, దేవులపల్లి సాయి శర్మ, కందాల రవి, రాయవరపు ప్రభాకర్, నగర ప్రముఖులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో పండితులకు సత్కారాలు



బాలాత్రిపుర సుందరి ఆలయంలో ప్రధాన అర్చకుడిని సత్కరిస్తున్న ఈఓ విజయభాస్కర్‌రెడ్డి

బోట్‌క్లబ్: దేవదాయశాఖ పరిధిలోని పలు ఆలయాల్లో మంగళవారం ఉగాది సందర్భంగా పండితులను సత్కరించారు. దేవదాయశాఖ పరిధిలో ఉన్న అన్ని ఆలయాల్లోను పండితులను శాలువాతో సత్కరించి, ఆయా ఆలయాలకు వచ్చే ఆదాయం ఆధారంగా నగదు పురస్కారం కూడా అందించారు. స్థానిక బాలాత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయం ప్రధాన అర్చకులు చెరుకూరి సుబ్రహ్మణ్యంను సత్కరించి రూ.10,116 చెక్కును ఈఓ చింతపల్లి విజయభాస్కర్‌రెడ్డి అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీకి పెరిగిన ఆదరణ





18, 43వ డివిజన్ల నుంచి పార్టీలో చేరిన వారిని స్వాగతిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

- ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

కాకినాడ: జనసేన, బీజేపీ, టీడీపీ అనైతిక కూటమితో విసుపోయిన ఆయా పార్టీల కేడర్ వైఎస్సార్ సీపీకి మద్దతుగా నిలుస్తున్నారని సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. సరైన అజెండా లేకుండా అధికారాన్ని కైవసం చేసుకోవడమే లక్ష్యంగా పార్టీల తీరుతో సాధారణ కార్యకర్తలు సైతం తీవ్ర అసంతృప్తితో ఉన్నారన్నారు. స్థానిక తూరంగిపేట 18 డివిజన్‌కు చెందిన జనసేన నాయకుడు కోనాడ సత్యనారాయణ మంగళవారం వైస్సార్ సీపీలో చేరారు. ఆయనతో పాటు సుమారు 50 మంది పైగా వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే ద్వారంపూడి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కొత్తగా పార్టీలో చేరిన ప్రతి కార్యకర్త ముఖ్యమంత్రి జగన్ మళ్లీ సీఎం కావడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. గడచిన ఐదేళ్లలో చేసిన అభివృద్ధి సంక్షేమాన్ని ప్రజలకు వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట డివిజన్ నాయకులు చవ్వాకుల రాంబాబు, దోని చిట్టిబాబు, పలువురు నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

43 డివిజన్‌లో టీడీపీ, జనసేన కూటమిలో క్రియాశీలక కార్యకర్తలు మంగళవారం వైఎస్సార్ సీపీలో చేరారు. ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి నివాసంలో ఈ కార్యక్రమం జరిగింది. మాజీ కార్పొరేటర్ జేడీ పవన్‌కుమార్ ఆధ్వర్యంలో గుల్లింక శివ రామకృష్ణ, వెల్లంకుల రమణ, మురళి, రెడ్డి, కొండ బాబు, ప్రదీప్ యూత్ సభ్యులతోపాటు మరో పది కుటుంబాలు పార్టీలో చేరారు.

భక్తిభావంతో ఇఫ్తార్



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే ద్వారంపూడి సతీమణి మహాలక్ష్మి



అధిక సంఖ్యలో హాజరైన ముస్లిం మహిళలు

పాల్గొన్న ఎమ్మెల్యే ద్వారంపూడి సతీమణి

కాకినాడ: ఇస్లాంలో మహిళలకు ప్రత్యేక స్థానం ఉందనే అంశాన్ని రుజువు చేస్తూ మంగళవారం కాకినాడలో రంజాన్ సందర్భంగా మహిళల ఇఫ్తార్ విందు భక్తి ప్రపత్తులతో నిర్వహించారు. స్థానిక డి కన్వెన్షన్‌లో ముస్లిం యంగ్‌మెన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి నగరంలోని పెద్ద ఎత్తున ముస్లిం మహిళలు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి సతీమణి మహాలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ శాంతియుత జీవనంతో పాటు సన్మార్గాలను అనుసరిస్తూ ముందుకు సాగుతున్న ముస్లిం సమాజానికి అల్లా కరుణా కటాక్షాలు ఉండాలని ఆకాంక్షిస్తూ వారికి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పసుపులేటి వెంకటలక్ష్మి, పలువురు ముస్లిం ప్రముఖుల కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

వైఎస్సార్ సీపీతోనే అందరికీ సముచిత స్థానం

- యండమూరులో టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి భారీగా చేరిక
- పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే కురసాల కన్నబాబు



పార్టీలో చేరిన వారితో కలసి హర్షం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

కరప: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నా బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మైనార్టీలంటూ వారికి అత్యధిక ప్రాధాన్యం ఇచ్చి, ఎవరూ చేయనివిధంగా సముచిత స్థానం కల్పించారని కాకినాడ రూరల్ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. మండలం యండమూరులో మంగళవారం రాత్రి వైఎస్సార్ సీపీ గ్రామకమిటీ అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతిపక్షాలు అన్ని వర్గాలను కలుపుకొంటామని చెప్పడమేకానీ, చేతల్లో చూపించిందేమీ లేదన్నారు. టీడీపీ, జేఎస్‌పీ, బీజేపీల పొత్తు తమ అవసరాల కోసమే కానీ ప్రజలకు, పేదలకు సేవ చేయడానికి కాదని ఆయా పార్టీలు ఇచ్చిన సీట్లను పరిశీలిస్తే అర్థమవుతుందన్నారు. చెప్పింది చెప్పినట్టుగా చేసి చూపించే నాయకుడు సీఎం జగన్ అని ఆయన అన్నారు. ఎన్నికల్లో సింగిల్‌గా సీఎం జగన్‌ను ఎదుర్కొనే సత్తాలేకనే చంద్రబాబునాయుడు అనైతిక పొత్తులు పెట్టుకుని, మాయమాటలు చెప్పేందుకు వస్తున్నారని, వారిమాయలో పడకుండా ఓటర్లు విజ్ఞతతో ఆలోచించి, సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్న జగన్‌ను మళ్లీ సీఎంగా చేసేందుకు వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనను, కాకినాడ పార్లమెంట్ సభ్యుడుగా చలమలశెట్టి సునీల్‌ను ఫ్యాన్‌గుర్తుపై ఓటేసి గెలిపించాలని కన్నబాబు కోరారు. జన్మభూమి కమిటీలను మళ్లీ తీసుకువస్తానని చెప్పే ధైర్యంలేకనే వలంటీర్ల వ్యవస్థను విమర్శించిన చంద్రబాబు అధికారంలోకి వస్తే కొనసాగిస్తాననడం విడ్డూరంగా ఉందని ఆయన విమర్శించారు. సంక్షేమ పథకాలు కొనసాగాలన్నా, మరింతగా రాష్ట్ర ప్రగతి జరగాలన్నా వైఎస్సార్ సీపీతో సాధ్యమన్నారు.

టీడీపీ నుంచి భారీగా చేరికలు..

యండమూరు టీడీపీ గ్రామకమిటీ అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ నురుకుర్తి వీరన్న ఆధ్వర్యంలో శెట్టిబలిజ సామాజిక వర్గానికి చెందిన 80 కుటుంబాల వారు వైఎస్సార్ సీపీలో చేరేందుకు ముందుకు రాగా ఎమ్మెల్యే కన్నబాబు వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఎస్సీ నాయకులు చేగొండి దుర్గారావు, మార్రెళ్ల ఆనందరావుల ఆధ్వర్యంలో ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన 50 కుటుంబాల వారు పార్టీలో చేరేందుకు ముందుకు రాగా ఎమ్మెల్యే కన్నబాబు వారికి పార్టీకండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీ అధికారంలోకి రాగానే అందరికీ సముచిత స్థానం కల్పిస్తామన్నారు. టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిన మాజీ సర్పంచ్ వీరన్న మాట్లాడుతూ శెట్టిబలిజ సామాజిక వర్గానికి టీడీపీ అన్యాయం చేసిందని, పొత్తు పెట్టుకున్నా జనసేన అభ్యర్థి గ్రామంలోకి వచ్చికూడా తనకు మాట మాత్రం చెప్పకుండా ప్రచారం చేయడంతో మనస్తాపం చెందానన్నారు. ముఖ్యమంత్రి జగన్, ఎమ్మెల్యే కురసాల కన్నబాబు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితుడనై వైఎస్సార్ సీపీలో చేరానన్నారు. జగనన్న సంక్షేమపథకాలద్వారా రూ 3.4 లక్షలు లబ్ధిపొందానన్నారు. వచ్చే ఎన్నికలలో ఎమ్మెల్యే కన్నబాబు, ఎంపీ సునీల్ గెలుపునకు కష్టపడతానన్నారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలతో కల్సి ఎమ్మెల్యే కన్నబాబు ఎన్నికల ప్రచారం నిర్వహించి, ఫ్యాన్ గుర్తుపై ఓటేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా సునీల్‌ను గెలిపించాలని ఓటర్లను కన్నబాబు అభ్యర్థించారు. నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, వైస్ ఎంపీపీలు బొమ్మిడి వీర్రాఘవులు, పాట్నీడి భీమేశ్వరరావు, రూరల్ జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, మండల పార్టీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు రొక్కాల గణేష్, మాజీ సర్పంచ్ మార్రెళ్ల వెంకటరమణ, ఏఎంసీ వైస్ చైర్మన్ అనచర్ల పార్వతి, షేక్ దరియా, పీఏసీఎస్ చైర్మన్ వనుం రమేష్, మండల యూత్ అధ్యక్షుడు పెంకే సత్తిబాబు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయులు పాల్గొన్నారు.

సీతారాముల కల్యాణానికి పసుపురాట ముహూర్తం



వాకతిప్పలో పసుపురాట వేస్తున్న భక్తులు

కొత్తపల్లి: వాకతిప్ప శాలివాస పద్మశాలి రామాలయం వద్ద సీతారాముల కల్యాణ మహోత్సవాలకు మంగళవారం భక్తులు పసుపురాట ముహూర్తం వేశారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. 17న జరగనున్న కల్యాణ మహోత్సవాలకు మండలంలోని ఆలయాలను ఆలయ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో సుందరంగా తీర్చిదిద్దుతున్నారు.

నూకాలమ్మ తల్లిని దర్శించిన భక్తులు

సామర్లకోట: గ్రామ దేవత నూకాలమ్మ తల్లిని భక్తులు భారీ సంఖ్యలో దర్శించుకున్నారు. ఆలయంలో ఉచిత దర్శనంతో పాటు రూ.10, రూ.20 దర్శనం క్యూలైన్లు ఏర్పాటు చేశారు. భక్తులకు ఆలయ ధర్మకర్తలు వల్లూరి బుల్లియ్య, ఈదల ఈశ్వరకుమార్, కర్రి ఆదినారాయణరెడ్డి, ఎం.పెద్దకాపు, బొమ్మాలరావు, పెనుమర్తి సత్యనారాయణ, యార్లగడ్డ శ్రీనివాసు తదితరులు సేవలందించారు.

పైన రంగు... ఒట్టి హంగు

- మామిడి పండ్ల పక్వానికి రసాయనాల వినియోగం
- స్వచ్ఛందంగా ముగ్గినవంటూ విక్రయాలు



చెట్లకింద విక్రయిస్తున్న మామిడి పండ్లు

బాలాజీచెరువు: వేసవి వచ్చిందంటే చాలు.. ఈ సీజన్‌లో అత్యధికంగా దొరికేవి మామిడి పండ్లు. పండ్లలో రారాజు మామిడి. సంపన్నుడి నుంచి సామాన్యుడి వరకూ మామిడి రుచి ఆస్వాదించాలని కోరుకుంటారు. ఇలా అందరికీ పసందైన మామిడి వేసవి కాలంలో ప్రారంభంకావడంతో మార్కెట్‌ను ముంచెత్తనున్నాయి. అయితే కొన్ని చోట్ల పండ్లను పరిశీలిస్తే పైన పటారం లోన లొటారం అన్న చందంగా ఉన్నాయి. గాలికి రాలిన కాయలను వ్యాపారులు ప్రమాదకరమైన కాల్షియం కార్బైట్‌ను ఉపయోగించి మాగించి తెచ్చి విక్రయిస్తున్నారు. స్వచ్ఛందంగా ముగ్గినవే అంటూ విక్రస్తున్నారు. ఆరోగ్యానికి హాని కలిగించే ఈ రసాయనం వినియోగాన్ని ప్రభుత్వం 2012లో నిషేధించింది. ఆరోగ్యకరమైన పద్ధతుల్లో సహజత్వానికి దగ్గరగా మాగించాలని సూచించింది. సాధారణంగా పండ్లు పక్వానికి వచ్చినప్పుడు పక్రృతి సిద్ధంగా వాటి నుంచి ఉత్పత్తి అయ్యే ఇథలిన్‌తో మాగుతాయి. ఆ రసాయనం ప్రభావం వల్ల దాని నిర్మాణం, రంగు, రుచి మారిపోతాయి.


ప్రత్యామ్నాయ రసాయనాలు..

తప్పని పరిస్థితుల్లో కాయలను మాగబట్టేందుకు వినియోగదారుకు హాని కలిగించని ఇథలిన్ వాయువు 100 పీపీఎం మాత్రమే వినియోగించాలి. దీనిని 24 గంటల పాటు తగిలేటట్టు ఉంచితే ఐదు రోజుల్లో సహజత్వానికి దగ్గరగా ఎలాంటి హాని లేకుండా మాగించవచ్చు. మామిడిని కోత అనంతరం 10 లీటర్ల నీటికి 13 ఎంఎల్ ఎత్రిన్ కలిపి అందులో మంచిగా ఆరబెడితే సహజత్వానికి దగ్గరగా మారతాయి. గడ్డి కింద కాయలను మాగబెట్టాలనుకుంటే మరింత సురక్షితం.

తేడాలివే...

సహజంగా మాగిన పండు రంగు కొంత పసుపు, కొంత ముదురు ఆకుపచ్చ రంగులో ఉంచి పండు లోపలి భాగం పరిపక్వంగా ఉంటుంది. కృత్రిమంగా మాగినవి ఒకే విధంగా కాంతివంతంగా లేత పసుపు కలిగి ఉంటాయి. పైకి మాగినట్లు కనిపించినా లోపల అపరిక్వంగా ఉండి పుల్లగా ఉంటాయి. కృత్రిమంగా మాగినవి దూరం నుండే వాటి వాసన బట్టి చెప్పవచ్చు.

మే నెలలో పూర్తిస్థాయిలో వస్తాయి



సీజన్ రాకముందే మామిడిపండ్లు తినడం మంచిది కాదు. సాధారణంగా మామిడి పండ్లు ఏప్రిల్ చివరి వారం మేనెలలో పూర్తి స్థాయిలో వస్తాయి. మార్చి నుండే కాయలు కోసి వాటిని రసాయనాలతో మగ్గించి విక్రయిస్తున్నారు. తద్వారా ముఖ్యంగా చిన్నపిల్లలో దగ్గు వంటి సమస్యలు వస్తాయి. పండ్లను ముందుగా ఉప్పు కలిపి 15 నుండి 20 నిముషాలు నీటిలో ఉంచి తర్వాత తడి లేకుండా తినాలి. సాధ్యమైనంత వరకూ తొక్కలేకుండా తినాలి.

– డాక్టర్ మాలోతు రమేష్, ఫుడ్ టెక్నాలజీ విభాగాధిపతి, జేఎన్‌టీయూకే

నిఘా బృందాలు సమర్థంగా పనిచేయాలి

ప్రత్యేక సమావేశంలో కాకినాడ రూరల్ ఆర్వో కిశోర్



ఎంసీసీ, ఎఫ్ఎస్‌టీ బృందాలతో అత్యవసర సమావేశంలో మాట్లాడుతున్న ఆర్వో కిశోర్

కాకినాడ రూరల్: ఎన్నికల నిఘా బృందాలు మరింత సమర్థవంతంగా పనిచేయాలని రూరల్ నియోజకవర్గ ఆర్వో ఇట్ల కిశోర్ సూచించారు. సర్పవరం జంక్షన్ వద్ద ఆర్వో కార్యాలయంలో ఎంసీసీ, ఎఫ్ఎస్‌టీ బృందాలతో మంగళవారం ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. విస్తతంగా తనిఖీలు చేపట్టాలని, ముఖ్యంగా కోడ్ ఉల్లంఘనలపై తక్షణం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాజకీయ పార్టీలు ఎన్నికల నిమామవళికి అనుగుణంగా వ్యవహరించాలని సూచించారు. సమావేశంలో తహసీల్దార్ విజయ ప్రసాద్, డిప్యూటీ సురేష్ పాల్గొన్నారు.